www.prajasakti.com

# ప్రజాశక్తి

గురువారం 26 సెప్టెంబర్ 2024

5

తూర్పుగోదావరి



## టెట్ షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

టెట్ షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. పాఠశాల విద్య సంచాలకులు ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు తెలిపారు. . ఉపాధ్యాయ అర్హత పరీక్ష జులై -2024 పేపర్-1, పేపర్-2 అక్టోబర్ 3 నుంచి 21 వరకు జరుగుతాయని తెలిపారు. సెషన్ -1 ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, సెషన్-2 మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాజమహేంద్రవరంలోని లూథర్‌గిరి వద్ద రాజీవ్ గాంధీ విద్యాసంస్థల్లో జరుగుతాయన్నారు. అభ్యర్థులందరూ తమ హాల్ టికెట్ వెనుక ఇవ్వబడిన సూచనలను తప్పక అనుసరించి పరీక్షకు హాజరు కావలన్నారు. సుమారు 8వేల మంది అభ్యర్థులు ఈ టెట్ పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు.

# గుంతలే పూడుస్తారట..!

- 1,300 కిలోమీటర్ల పైనే దెబ్బతిన్న రోడ్లు
- ప్రమాదాల బారిన ప్రయాణికులు
- తాత్కాలిక మరమ్మతులకే గ్రీన్ సిగ్నల్
- రూ.33.87 కోట్లు విడుదల



అంబేద్కర్ కోనసీమ జిల్లా అలమూరు మండలం జొన్నాడ మలుపు వద్ద రోడ్డు దుస్థితి

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

వైసిపి ఐదేళ్ల పాలనలో రోడ్లు అధ్వానంగా మారాయని, గుంతలు, గోతుల్లో కనీసం తట్టెడు మట్టి కూడా వేయలేని దౌర్భాగ్య స్థితిలో పాలన సాగిందని టిడిపి, జనసేన, బిజెపి నేతలు పదే పదే తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రహదారులను కనీసంగా కూడా పట్టించుకోకపోవడంతో ప్రధానంగా వైసిపి ఘోర పరాజయానికి కారణమైందని పెద్దఎత్తున చర్చలు సాగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని నేతలు హామీలు ఇచ్చారు. అయితే అధికార పగ్గాలు చేపట్టిన చంద్రబాబు కేవలం మరమ్మతులు మాత్రమే ప్రస్తుతానికి చేపడతామని ఇటీవల ప్రకటించారు. జిల్లాలో పాడైన రోడ్ల గుంతలు పూడ్చేందుకు ప్రభుత్వం అరకొర నిధులను మాత్రమే మంజూరు చేసింది.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 10,859 కిలోమీటర్ల పొడవున జాతీయ రహదారులు (ఎన్‌హెచ్), 16, 216 ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ రహదారులు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 3,060 కిలోమీటర్లు, తూర్పు గోదావరి జిల్లాలో 4,329, కోనసీమ జిల్లాలో 3,466 కిలోమీటర్లు ఉన్నాయి. వీటి పరిధిలో 1300 కిలోమీటర్లు పైనే రహదారులు దెబ్బతిన్నట్లు ఆయా శాఖల అధికారులు గుర్తించారు. కొన్ని రోడ్లు బాగానే ఉన్నా ఎక్కువ వాహనాలు నడిచే రోడ్లు దారుణంగా మారాయి.



కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని రమణయ్యపేట-జె.అన్నవరం రోడ్డు

### వైసిపి పాలనలో తీవ్ర నిర్లక్ష్యం

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్ల మరమ్మతులు గాని, నూతన నిర్మాణాలు గానీ చేపట్టకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడింది. మామూలు రోజుల్లో పెద్ద పెద్ద గుంతలు పడి దుమ్ము, ధూళి లేస్తుంది. వర్షాలు పడిన సందర్భాల్లో ఎక్కడికక్కడ గుంతల్లో నీరు నిలిచి వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. సామర్లకోట నుంచి రాజానగరం వెళ్లే ఎడిబి రోడ్డు మార్గంలో ప్రయాణికులు నిత్యం నరకం చూస్తున్నారు. పెద్ద పెద్ద గుంతల్లో వాహనాలు ఇరుక్కుపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. మోటారు సైకిల్‌పై వెళ్లే ప్రయాణికులు తీవ్ర గాయాలపాలవుతున్నారు. అనేకమంది ప్రాణాలను కోల్పోతున్నారు. సామర్లకోట నుంచి కాకినాడ వెళ్లే సుమారు 15 కిలోమీటర్ల రోడ్డు గుంతల మయంగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తొండంగి మండలం అద్దరిపేట నుంచి ఒంటిమామిడి, పెరుమాళ్లపురం, కోనపాపపేట, శ్రీరాంపురం, మూలపేట, అమీనాబాద్, ఉప్పాడ బీచ్ రోడ్డు మీదుగా ఆయా గ్రామస్తులు కాకినాడ వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తుపానులు వరదలు వచ్చినప్పుడల్లా ఈ బీచ్ రోడ్డు దారుణంగా మారిపోయింది. పెద్దాపురం నుంచి కాట్రావులపల్లి, రాచపల్లి నుంచి శంఖవరం ఆశ్రమం, ఒమ్మంగి, ఉత్తరకంచి నుంచి పెద్ది పాలెం, తుని నుంచి నడకుదురు ఇలా అనేక రోడ్లు నరకం చూపిస్తున్నాయి.

### ప్రాణాలు పోతున్నాయి

వివిధ సందర్భాల్లో కాకినాడ జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల గణాంకాలను పరిశీలిస్తే నెలకు సగటున 23 మరణాలు సంభవిస్తున్నాయి. 2022లో 808 ప్రమాదాలు జరగ్గా 338 మంది చనిపోయారు. నెలకు సగటున 28 మరణాలు సంభవించాయి. ఆ ఏడాది 93 ప్రమాదాలు జరిగాయి. 322 ప్రమాదాలు మరణాలకు దారి తీశాయి. గతేడాది 700పైనే ప్రమాదాలు జరగగా 278 మంది మరణించారు. నెలకు సగటున 23 మరణాలు జరిగాయి. వీటిలో 98 తీవ్ర ప్రమాదాలున్నాయి. మరణాలకు దారి తీసిన ప్రమాదాలు 253 జరిగాయి. ఈ ఏడాది ఇదే తరహాలో ప్రమాద ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ప్రజలు రోడ్లపై ప్రయాణించాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు.

### కంటితుడుపు చర్యలతో సరి


గత ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత కంటి తుడుపు చర్యలకే పరిమితం అయ్యారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రోడ్ల దుస్థితిపై జరిగిన సమీక్షలో సిఎం చంద్రబాబు తాత్కాలిక మరమ్మతులు మాత్రమే చేపడుతున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో రూ.33.87 కోట్లు నిధులను కేటాయిస్తున్నామని తెలిపారు. వీటి ద్వారా 522 కిలోమీటర్లు జిల్లా ముఖ్య రోడ్లు, 180 కిలోమీటర్లు రాష్ట్ర జాతీయ రహదారులను మరమ్మతులు చేయనున్నారు. కాకినాడ డివిజన్‌కు రూ.5.51 కోట్లు, పెద్దాపురం డివిజన్‌కు రూ.2.62 కోట్లు, అమలాపురానికి రూ.17.99 కోట్లు, రాజమహేంద్రవరం డివిజన్‌కు రూ.7.74 కోట్లతో పనులు చేయనున్నారు. వాస్తవానికి దెబ్బతిన్న మొత్తం రహదారులకు మరమ్మతులు చేయాలంటే కనీసం రూ.100 కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు. అరకొర నిధులు కేటాయించడంతో ప్రాధాన్యత క్రమంలో ఈ పనులు ఎలా చేపట్టాలనే సందిగ్ధంలో, మరోవైపు పనులపై ప్రజాప్రతినిధులు ఒత్తిడి చేస్తే ఎలా అని అధికారులు తలలు పట్టుకుంటున్నారు.



పులిని పట్టుకునేందుకు తీసుకొచ్చిన బోను, (ఇన్‌సెట్‌లో) పులి పాదముద్రలు

# జనావాసంలోకి చిరుత

## కడియపులంకలో పాదముద్రల గుర్తింపు



ప్రజాశక్తి- కడియం

రాజమహేంద్రవరం శివారు దివాన్‌చెరువు రిజర్వ్ ఫారెస్టులోకి వచ్చిన చిరుత ఇప్పుడు జనావాసంలోకి ప్రవేశించింది. కడియం మండలం కడియపులంక నర్సరీల్లో చిరుత పాదముద్రలను అధికారులు గుర్తించారు. చిరుత సంచారం వార్తతో స్థానికుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి.

ఇరవై రోజులు క్రితం దివాన్‌చెరువు రిజర్వ్ ఫారెస్ట్ సమీపంలోని దూరదర్శన్ కేంద్రం సిసి టివిల్లో చిరుత సంచారాన్ని గుర్తించారు. కొన్ని రోజుల వరకూ అది అటవీప్రాంతంలోనే ఉంది. దాన్ని పట్టుకునేందుకు 50 మంది అటవీశాఖ సిబ్బందితో పది బృందాలను ఏర్పాటు చేశారు. 70 వరకూ ట్రాఫ్ కెమెరాలు, 7 బోన్‌లను సైతం ఏర్పాటు చేశారు. రెండు మూడు సార్లు ట్రాప్‌కెమెరాల్లో చిరుత సంచారాన్ని గుర్తించారు. కాని దీన్ని పట్టుకోలేపోయారు. అయితే గత నాలుగు రోజుల నుంచి చిరుత సంచారం ఎక్కడ కనిపించలేదు. తాజాగా మంగళవారం రాత్రి కడియపు లంకలోని నర్సరీల్లో చిరుత తిరుగుతున్నట్లు స్థానిక రైతులు అధికారులకు సమాచారం ఇచ్చారు. తూర్పుగోదావరి జిల్లా అటవీ శాఖ అధికారి భరణి, కోనసీమ జిల్లా అటవీశాఖ అధికారి ప్రసాద్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పాదముద్రలు చిరుతపులివిగా గుర్తించారు. రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇది బుర్రిలంక వైపు వెళ్లే అవకాశాలు ఉన్నట్టు భావిస్తున్నారు. ఈ మేరకు ఆయా ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. దీనిపై మంత్రి కందుల దుర్గేష్ జిల్లా అటవీ శాఖాధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.. చిరుతను పట్టుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, ప్రజలకు అవగాహన, భరోసా కల్పించాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలనికోరారు. చిరుత కదలికలు గుర్తించేందుకు నర్సరీల్లో 20 ట్రాప్ కెమెరాలను అమర్చారు. అలాగే రెండు బోనుల్లో చిరుతకు ఎరగా మేక పిల్లను, పందిని అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో చిరుత పులి కదలికను పాదముద్రల ద్వారా అటవీ శాఖ అధికారులు గుర్తించారు. ప్రస్తుతం చిరుత పులి బుర్రిలంకకు సమీపంలో ఓ నర్సరీలో గుబురుగా గల ఈత చెట్ల పొదల్లో ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



## మహిళలు శక్తివంతులుగా మారాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

మహిళల సమాజంలో శక్తి వంతులుగా మారాలని మహిళా జైలు సూపరింటెండెంట్ వసంత కె.చెట్టి అన్నారు. బుధవారం ఆర్ట్స్ కళాశాలలో 'నేను మీకు తెలుసా?' కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. మరో ముఖ్యఅతిథి రిటైర్డ్ అడ్వకేట్, ఫార్మర్ ఛైర్మెన్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులు బి .పద్మావతి మాట్లాడుతూ విద్యార్థినిలతో పరస్పర చర్చ కార్యక్రమం నిర్వహించి వారికి ప్రస్తుత సమాజంలో స్త్రీ పాత్ర, సోషల్ మీడియాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. చర్చా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినిలకు పుస్తకాలను బహుకరించారు. తొలుత ప్రిన్సిపల్ రామచంద్ర మాట్లాడారు. మహిళల రక్షణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 100, 108, 181, 112,1098,139,1930 నంబర్లు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ అన్నపూర్ణ అకాడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజేశ్వరి, మహిళా సాధికారత కో-ఆర్డినేటర్ డాక్టర్ సురేఖ, విద్యార్థినులు పాల్గొన్నారు. .

# శాఖల మధ్య సమన్వయం అవసరం

## వైద్యాధికారులకు కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

హై రిస్క్ గర్భిణుల గుర్తింపు, ఇమ్యూనైజేషన్ లక్ష్యాలను సాధించడంలో ఐసిడిఎస్, వైద్య ఆరోగ్య శాఖ మధ్య సమన్వయం లోపం స్పష్టంగా కనిపిస్తోందని, దీన్ని అధిగమించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ పిహెచ్‌సి, సిహెచ్‌సి, పరిధిలో ప్రతినెలా నిర్దేశించిన లక్ష్యాలకు సంబంధించి ఆరా తీశారు. ఆయా పిహెచ్‌సి పరిధిలో ఐసిడిఎస్, వైద్య అధికారులు సంయుక్తంగా బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. ధవళేశ్వరం పిహెచ్‌సి పరిధిలో ఎక్కువ డెలివరీ కేసులు నమోదు అవ్వడంలో సంబంధిత మెడికల్ ఆఫీసర్ పని తీరును అభినందించారు. ప్రజల్లో చైతన్యం కలిగించే విధంగా చొరవ చూపాలన్నారు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ డెలివరీ అయ్యే విధంగా నమ్మకం పెంచేలా అధికారులు చొరవ ముఖ్యం అన్నారు. ప్రవేట్, ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీ కేసులు నెలవారీ డేటా విశ్లేషణ చేయాలన్నారు. సమ్మె కారణంగా అత్యవసర కేసుల విషయంలో నిర్లక్ష్యం వహించ వద్దని, అటువంటి సందర్భాల్లో ప్రజల ప్రాణాలని కాపాడడం కోసం ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. క్షేత్ర స్థాయిలో ఇమ్యూనైజేషన్ అనుకున్న లక్ష్యాలను సాధించడంలో లోపాలను అధిగమించడం, డేటా ఎంట్రీ నమోదు విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాల, ప్రాంతాల వారీగా గుర్తించిన వ్యాధుల వివరాలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాకుండ ప్రవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందడానికి కారణం తెలుసుకోవాలని, వాటి మళ్లింపునకు కారణాలతో ఐసిడిఎస్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నివేదికలు అందించాలన్నారు. కంటి వెలుగుకు సంబంధించి సిఫార్సు చేసిన వాటి యదార్థ స్థితిపై నివేదిక అందించాలన్నారు. 108, 104 వాహనం సంబంధించి వస్తున్న ఫోన్ కాల్స్, పట్టే సమయం, ఏఏ కేసులకు సంబంధించి సేవలు అందిస్తున్నారనేదానిపై నివేదిక ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ ఎన్‌పి.పద్మశ్రీ, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ ఎన్.వసుంధర, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.లక్ష్మీసూర్యప్రభ, ఐసిడిఎస్ పీడీ కె.విజయకుమారి, జిల్లా వాస్ప్ ఆరోగ్య సేవా కో ఆర్డినేటర్ డాక్టర్ పి.ప్రియాంక, ఇతర వైద్య ఆరోగ్య శాఖ, ఐసిడిఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రెండోవ రోజు పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - యంత్రాంగం

**జిల్లాలో రెండో రోజు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాగుకు సంబంధించి పలు విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు.**

**సీతానగరం :** మండలంలో రఘుదేవపురం, చిన్నకొండేపూడి గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాధికారి డాక్టర్ ఎస్.మాధవరావు హాజరై మాట్లాడారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు వినియోగించాలని, ఎరువులు పురుగు మందులు వినియోగానికి డ్రోన్స్ ఉపయోగించాలని తెలిపారు. డ్రోన్ ఉపయోగించడం వలన పురుగు మందులు ఎరువులు సమర్థవంతంగా పనిచేయడంతో పాటు ఖర్చులు ఆదా చేయొచ్చని తెలిపారు. జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్ ఎన్. వి. నరసింహారావు మాట్లాడుతూ వరిలో ఎండు తెగులుకు యాజమాన్య పద్ధతులు గురించి తెలియజేశారు. కోరుకొండ ఎడిఎ మల్లికార్జునరావు, డిఆర్‌సి ఎడిఎ రామలక్ష్మి, ఎఒ కె.సూర్యరమేష్, ఎఇఒ పివి.శ్రీనివాస్, విఎఎలు పాల్గొన్నారు.


**గోకవరం :** మండలంలోని కొత్తపల్లి, కామరాజుపేట గ్రామాల్లో ఆయా సర్పంచులు కాటమస్వామి, అడపా వెంకట్రావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం నిర్వహించామని ఎఒ రాజరాజేశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, వ్యవసాయ ఉద్యానవన శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

**చాగల్లు :** మండలంలోని మార్కొండపాడు, దారవరంలో సర్పంచులు , ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించామని ఎఒ కె.గోపాలకష్ణ తెలిపారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి వచ్చేలా అవగాహన కల్పించామన్నారు. డ్రోన్ ద్వారా ఎరువులు, పురుగుమందుల పిచికారీపై అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు డాక్టర్ యు ముఖేష్ రైతులు పాల్గొన్నారు.

**కడియం :** మండలంలోని జేగురుపాడులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎడిఎ శ్రీనివాసరెడ్డి, ఎఒ ద్వారకాదేవి మాట్లాడారు. పంటసాగు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సస్యరక్షణ, పలు పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు నాగిరెడ్డి రామకృష్ణ, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## 'తిరుమల' రూ.1.02 కోట్ల విరాళం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



సిఎంకు చెక్కు అందిస్తున్న తిరుమల విద్యార్థులు

విజయవాడ వరద బాధితుల సహాయార్థం సిఎం రిలీఫ్ ఫండ్‌కు తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు రూ.1.02 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విజయవాడలో బుధవారం అందజేశారు. తిరుమల విద్యాసంస్థల ఉద్యోగుల వేతనం నుంచి అందజేసిన మొత్తం రూ.25,49,628, విద్యార్థులు విరాళంగా ఇచ్చిన రూ.76,50,972 మొత్తంగా ఒక కోటి రెండు లక్షల ఆరువందల రూపాయలను అందిచామని ఆయన తెలిపారు. గతంలో తిరుమల యాజమాన్యం రూ.50 లక్షలను వరద బాధితుల సహాయార్థం అదించింది. మొత్తంగా ఇప్పటి వరకూ తిరుమల విద్యాసంస్థల నుంచి వరద బాధితులకు రూ.1.52 కోట్లు అందించామన్నారు. దీనికి సహకరించిన విద్యార్థులకు, సిబ్బందికి, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెసిడెంట్ డైరెక్టర్లు కె.సత్యనారాయణ, ఎస్.సాయిరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మరింత విస్తృతంగా 'విజన్'

ప్రజాశక్తి - కడియం

తమ 'విజన్ సేవా ట్రస్ట్' ద్వారా మరిన్ని సేవలను విస్తృత పరుస్తామని ట్రస్ట్ చైర్మన్ పిల్లా సత్యమంజరి తెలిపారు. మండపేట మండలం పాలతోడులో పలువురు వృద్ధులకు బుధవారం ట్రస్ట్ తరపున దుప్పట్లు అందజేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కొత్తపేట గ్రామానికి చెందిన ట్రస్ట్ ద్వారా ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు ట్రస్ట్ డైరెక్టర్ పిల్లా వీరవెంకటరమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పిల్లా శ్రీనివాస్, దొడ్డా రాంబాబు, బి. వెంకట్రావు, పండ రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ పెద్దలు ట్రస్ట్ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.

## సెక్యూరిటీ గార్డులకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు మున్సిపాలిటీ తీరుగూడెంలో నిర్మించిన టిడ్కో అపార్ట్‌మెంట్స్‌లో సెక్యూరిటీ గార్డులుకు వెంటనే జీతాలు చెల్లించాలని సిపిఎం నాయకులు జువ్వల రాంబాబు డిమాండ్ చేస్తున్నారు. రాజమహేంద్రవరానికి చెందిన 'రాయల్ సెక్యూరిటీ' సంస్థలో వీరు పనిచేస్తున్నారనానరు. ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వట్లేదన్నారు. జీతాలు ఇప్పించాలని కార్మికులు నిడదవోలు లేబర్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందించారన్నారు. అప్పటి నుంచి రాయల్ సెక్యూరిటీ సంస్థ యజమానులు కార్మికులను బెదిరింపులకు దిగుతున్నారన్నారు. 'లేబర్ ఆఫీసర్ జీతాలు ఇస్తాడు వెళ్లండి' అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారన్నారు. వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. జీతాలు వెంటనే ఇవ్వాలని, లేకుంటే రాయల్ సెక్యూరిటీ సంస్థ వద్ద ఆందోళన చేబడతామని హెచ్చరించారు. ఆయన వెంట మగ్గం వీర రాఘవులు జె.కృష్ణమూర్తి, బి.కోటేశ్వరరావు, ఉసురుమర్తి సీతయ్య ఉన్నారు

## రూ.20వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి -దేవరపల్లి


దేవరపల్లిలో ఇటీవల మరణించిన జనసేన కార్యకర్త లింగాల శ్రీనివాస్ కుటుంబానికి ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సువర్ణరాజు ఆధ్వర్యంలో నాయకులు పరామర్శించి రూ.20వేల సాయం అందించారు. నాలుగు బియ్యం బస్తాలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కంబాల సత్తిబాబు, చప్పటి శివ, కొండపల్లి రమేష్, దాసరి శేషారావు, మాధవరపు వెంకటేశ్వర రావు, సూరిశెట్టి బాలు, జాజిమొగ్గల శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విఒఎలకు రెండు నెలల వేతనాలు జమ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చొరవతో విఒఎలకు రెండు నెలల వేతనాలు జమయ్యాయని విఒఎల సంఘం మండల అధ్యక్షురాలు గద్దె రాజేశ్వరి తెలిపారు. బుధవారం సత్యవాడ లో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి దుర్గేష్‌కు విఒఎలు కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 16న ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన వేతన బకాయిల కోసం మంత్రి దుర్గేష్‌కు వినతి పేరిట వచ్చిన వార్తకు అధికారులు స్పందించారన్నారు. బకాయిల్లో రెండు నెలల కాలానికి విడుదల చేసిందని, మిగిలిన నెలల జీతం త్వరలో విడుదల అయ్యేలా మంత్రి చొరవ తీసుకుంటారని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తమ సమస్యల పట్ల స్పందించిన ప్రజాశక్తి దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

## కార్టూ'నిజం'



# స్వర్ణాంధ్ర దిశగా కూటమి పాలన

## మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం



గర్భిణులకు దుస్తులు అందిస్తున్న కందుల దుర్గేష్

స్వర్ణాంధ్ర దిశగా రాష్ట్రంలో కూటమి పాలన సాగుతుందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం మండలంలోని సత్యవాడలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 రోజుల కూటమి పాలనపై ప్రజల ఆలోచనలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. తొలుత ఐసిడిఎస్ ఆధ్వర్యంలో 9 మంది గర్భిణులకు సామూహిక సీమంతాల్లో ఆయన పాల్గొన్నారు. ఒక చిన్నారికి అన్నప్రాసన చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పోషకాహారాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని సూచించారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం సత్యవాడ బాల జ్యోతి పాఠశాల, మోర్త నవోదయ పాఠశాల, విద్యార్థులు, యాజమాన్యం సేకరించిన రూ.40 వేలు, రూ.21 వేలు, సత్యవాడ డ్వాక్రా సభ్యులు సేకరించిన రూ.45,300లను మంత్రికి అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు, సర్పంచ్ ఇందుకూరి దేవిభార్గవి, ఉపసర్పంచ్ ప్రసాదరాజు, ఐవిఎస్.రాజు, సింహాద్రి రామకృష్ణ, కాకర్ల నాని, తహశీల్దార్, ఎంపిడిఒ, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

**చాగల్లు :** మండలం దారవరంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్నిబొడ్డు రాజు, సర్పంచ్ హరికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ కొవ్వూరు నియోజక వర్గం అధ్యక్షుడు టివి.రామారావు హాజరయ్యారు. తొలుత ఎన్‌టిఆర్ విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. డ్వాక్రా మహిళలకు రూ.50 లక్షల చెక్కు అందించారు. ఈ కార్యక్రమంలో నాదెండ్ల శ్రీరామ్‌చౌదరి, సుంకర రమేష్ బొల్లిన శివ నాగేంద్ర, తహశీల్దార్ ఎం.మెరుకమ్మ, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ పి.నిర్మలకుమారి తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాతలు ముందుకు రావాలి

ప్రజాశక్తి - గోపాలపురం

ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడేందుకు రక్తదానం చేసేందుకు దాతలు ముందుకు రావాలని కొండవీటి విద్యాసంస్థల సెక్రటరీ కరస్పాండెంట్ కెఎస్‌డి.ఆశీర్వాదం, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చైతన్యరాజు పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గౌతమి జూనియర్ కళాశాల, కొండవీటి డిగ్రీ కళాశాల విద్యార్థులు రక్తదానం సుమారు 40 మంది బుధవారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆశీర్వాదం, చైతన్యరాజు మాట్లాడారు. వివిధ ప్రమాదాల్లో గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న క్షతగాత్రులకు సమయానికి రక్తం అందుబాటులో లేకపోవడంతో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని రక్తం దానం చేయాలని పిలుపునిచ్చారు. దీని వల్ల మరొకరి ప్రాణాలను కాపాడొచ్చున్నారు. విద్యార్థులు సేవా దృక్పథంతో ముందుకొచ్చి రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ ప్రసాద్, సంపత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రక్తదానం చేసన్తున్న విద్యార్థులు

# నేరాలు ఘోరాలు

## అత్యాచారం కేసులో 12 ఏళ్ల జైలు

**ప్రజాశక్తి - అన్నవరం**

అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన అత్యాచారం కేసులో ముద్దాయికి జిల్లా కోర్ట్ 12 ఏళ్ల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ కిషోర్‌బాబు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. శంఖవరం మండలం గొంది గ్రామానికి చెందిన యువతని వివాహం చేసుకుంటానని నమ్మించి అత్యాచారానికి పాల్పడిన గంటిమల్ల సతీష్‌పై గత ఏడాది కేసు నమోదు అయింది. ఈ కేసులో నేరం రోజు కావడంతో జిల్లా 8వ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జ్ వై.బెన్నయ్య నాయుడు ముద్దాయికి 12 సంవత్సరాల జైలు శిక్ష విధించారని, ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున పిపి మారిశెట్టి వెంకటేశ్వరరావు వాదించారు.

## ఎడిబి రోడ్డులో ప్రమాదం

**ప్రజాశక్తి -పెద్దాపురం**

పెద్దాపురం - రాజమహేంద్రవరం ఎడిబి రోడ్డులోని ఎపిఎస్‌పి పెట్రోల్ బంక్ సమీపంలో ఎదురెదురుగా వెళ్తున్న బస్సు- ట్రాక్టర్ బలంగా ఢీ కొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. అయితే ఎడిబి రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కల్గింది. వర్షం నేపథ్యంలో వాహనాలు బ్రేకులు జారడంతో ఈ ప్రమాదం జరిగినట్టు సమాచారం. ఎస్ఐ మౌనిక సిబ్బందితో సంఘటన ప్రాంతానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

## ట్రాక్టర్, బైకు ఢీకొని ఇద్దరికి గాయాలు

**ప్రజాశక్తి - మామిడికుదురు**

బి.దొడ్డవరం రంగా విగ్రహం వద్ద బుధవారం బైకును ట్రాక్టర్ ఢీ కొట్టిన సంఘటనలో ఇద్దరు గాయపడ్డారు పెదపట్నం లంకకు చెందిన కట్టికిరెడ్డి ప్రసాద్ కుమారుడు సాయిని తీసుకొని బైకుపై అప్పనపల్లి వెళుతుండగా బి.దొడ్డవరం సమీపంలో అప్పనపల్లి నుంచి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వీరి బైకును ఢీ కొట్టి పక్కనే ఉన్న ఇంటి ప్రహరిని ఢీకొట్టడంతో ట్రాక్టర్ చక్రాలు విరిగిపడ్డాయి. ఈ ప్రమాదంలో బైకుపై ఉన్న ప్రసాద్, సాయి గాయపడ్డారు.

## బాలికపై అత్యాచారం కేసులో నిందితుని అరెస్టు

**ప్రజాశక్తి- రామచంద్రపురం**

బాలికపై అత్యాచారం చేసి తప్పించుకు తిరుగుతున్న కేసులో నిందితుని రెండేళ్ల తర్వాత అరెస్టు చేశామని కె.గంగవరం ఎస్ఐ జానీ బాషా తెలిపారు. కె.గంగవరం రైల్వే కాలనీలో నివాసముంటున్న బాలిక తల్లి హైదరాబాద్ పనుల నిమిత్తం వెళ్ళగా అదే గ్రామానికి చెందిన సామి రెడ్డి సత్తిబాబు రాత్రి సమయంలో తాగి వచ్చి బాలికపై అత్యాచారం చేశాడు. దీంతో బాలిక హైదరాబాద్‌లో తన తల్లి వద్ద చేరుకుని నిందితునిపై ఫిర్యాదు చేశారు. హైదరాబాదులో కేసు నమోదు చేసిన పోలీసులు విషయాన్ని కోనసీమ జిల్లా ఎస్‌పికి సమాచారం అందించారు. దీనిపై కె.గంగవరం పోలీస్ స్టేషన్‌లో 2022న కేసు నమోదయ్యింది. పోలీసులు ఆధునిక పరిజ్ఞానంతో ఎన్‌టిఆర్ జిల్లా గొల్లపూడిలో ఆర్‌టిసి బస్టాండ్ వద్ద కాలనీలో సత్తిబాబును అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు.

## దారి దోపిడీ దొంగలు అరెస్టు

**ప్రజాశక్తి- రాజానగరం**

జాతీయ రహదారిపై వాహనదారులను బెదిరించి చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని రాజానగరం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సిఐ ప్రసన్నవీరయ్యగౌడ్ తెలిపిన వివరాల మేరకు ఈ నెల 22న చత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా కుంటలో నివాసం ఉంటున్న వరదా మణికంఠ పండ్ల వ్యాపారం నిమిత్తం దివాన్ చెరువు పండ్ల మార్కెట్‌కు బొలేరా వ్యాన్‌తో బయలుదేరాడు. మార్గమధ్యంలో కొంతమూరు గామన్ బ్రిడ్జి రోడ్ పెట్రోల్ బంక్ సమీపంలో వ్యాన్‌ను పక్కన ఆపి బహిర్భూమికి వెళ్తున్నాడు. ఆ సమయంలో మాస్కులు ధరించిన ఇద్దరు వ్యక్తులు కత్తులతో వచ్చి మణికంఠను చీకట్లోకి లాక్కుని వెళ్లారు. మెడపై కత్తి పెట్టి చేతికి ఉన్న రెండు బంగారం ఉంగరాలు, సెల్‌ఫోన్, రూ.10 వేల నగదును తీసుకుని వెళ్లిపోయారు. దీనిపై మణికంఠ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కొంతమూరుకు చెందిన సాలా బలరామ్, బాలం ఏసు నిందితులుగా గుర్తించి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. తక్కువ సమయంలో నిందితులను గుర్తించి కోర్టు తరలించడానికి కృ చేసిన సిఐ ప్రసన్న వీరయ్య గౌడ్, ఎస్ఐలు మనోహర్, రేవతి, హెడ్ కానిస్టేబుల్ పి.అమ్మిరాజు, కానిస్టేబుల్స్ పవన్ కుమార్, బి.వెంకటరమణలను జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ అభినందించారు.

## సాయిరామ్ మృతదేహానికి పోస్టుమార్టం

**ప్రజాశక్తి-ముమ్మిడివరం, అమలాపురం**

విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందిన మోర్త సాయిరాం కుమార్ (42) మృతదేహానికి బుధవారం ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రిలో పోస్ట్ మార్టం నిర్వహించారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఐ.పోలవరం మండలం పశువుల్లంక పంచాయతీ పరిధిలోని అంబటివారిపాలెంకు చెందిన సాయిరామ్ కుమార్ పశువుల్లంకలో ఐదేళ్లుగా లైన్‌మాన్ సహాయకునిగా పని చేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం అన్నంపల్లి టోల్ గేట్ వద్ద విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తుండగా విద్యుత్ ఘాతానికి గురై సాయిరాం మృతి చెందిన విషయం విదితమే. సాయిరామ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించినట్లు ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ తెలిపారు. సాయిరామ్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

**సాయిరామ్ కుటుంబాన్ని ఆదుకోవాలి**

మోర్త సాయిరాం కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వల్లనే ఈ ప్రమాదం జరిగిందన్నారు. తాత్కాలిక కార్మికుల చేత పనిచేయిడం చట్ట విరుద్ధం అన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో నిండు ప్రాణం బలయిందని ఆవేదన వ్యక్తం చెందారు.

## నానాజీ, రఘురామను శిక్షించాలి

**ప్రజాశక్తి-కాట్రేనికోన**

అంబేద్కర్ ఫ్లెక్సీలు చింపివేసిన ఎంఎల్ఎ రఘురామ కృష్ణంరాజు, దళిత వైద్యునిపై దురుసుగా ప్రవర్తించిన ఎంఎల్ఎ పంతం నానాజీపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఎంఎల్ఎల దిష్టిబొమ్మలను దహనం చేసి కాట్రేనికోన పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

# ముంపు సమస్యకు పరిష్కారం ఏది?

**ప్రజాశక్తి - సామర్లకోట**

పట్టణంలో తేలికపాటి వర్షం కురిసిన ముంపు బారిన పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఒక మోస్తరు వర్షం పడితే కాలువలు పొంగి మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప చొరవతో దశాబ్ద కాలంగా పేరుకుపోయిన మేజర్ డ్రెయిన్‌లలో పూడికలు తొలగించే ప్రక్రియ జోరుగా సాగుతోంది. అయినప్పటికీ వర్షం పడితే చాలు రోడ్లు, డ్రెయిన్లు ఏకమవుతున్నాయి. డ్రెయిన్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడం, వాహనాల పార్కింగ్‌నకు డ్రెయిన్లపై స్లాబ్ రాళ్లు ఏర్పాటు చేసుకుని ఆక్రమణలకు పాల్పడుతున్నారు. దీంతో కాలువల్లో పేరుకుపోయిన పూడిక నీటి ప్రవాహానికి అవరోధంగా మారుతోంది.



సాయిబాబా ఆలయాన్ని ముంచెత్తిన వర్షపు నీరు

మంగళవారం ఉదయం పట్టణంలో కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రెసిడెంట్ గారి వీధి, మఠం సెంటర్, వెలమపేట, ప్రసన్న ఆంజనేయ నగర్, ఆర్‌టిసి బస్టాండ్ వంటి ప్రాంతాలు చెరువుల్లా మారాయి. డ్రెయిన్లలోకి వర్షపు జలాలు వెళ్లేందుకు వీలు లేకపోవడంతో మురుగు జలాలు సైతం రైడ్లపైకి చేరి అవి గృహాల్లోకి ప్రవేశించాయి. దీంతో ఆయా ప్రాంతాలోని ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. పట్టణంలో 23 ఎం ఎం వర్షపాతం నమోదు అయినట్టు తహశీల్దార్ చంద్రశేఖర రెడ్డి వెల్లడించారు. అయితే మేజర్ డ్రెయిన్లతోపాటు, పెద్దాపురం, పిఠాపురం ప్రధాన రహదారుల్లోనూ, తరచూ ఇబ్బంది ఏర్పడుతున్న ప్రాంతాల్లో అధికారులు కఠిన చర్యలు తీసుకుని డ్రెయిన్లపై ఉన్న ఆక్రమణాలను తొలగించి, తక్షణమే పూడిక తీత కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన

**ప్రజాశక్తి - గండేపల్లి, సామర్లకోట, కరప**

సామర్లకోట పట్టణంలో 28, 29 వార్డులకు సంభందించి 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం అన్నపూర్ణ ఫంక్షన్ హాలులో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొని మాట్లాడారు. మీరిచ్చిన బలంతో నియోజక వర్గంలో మరింత అభివృద్ధికి పాటుపడుతూ అవసరమైన నిధులు రాబడతానని అన్నారు. ప్రజలంతా బాగుండాలని సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారని అన్నారు. నియోజక వర్గంలో పెండింగులో ఉన్న పనులతోపాటు కొత్త పనులను చేపడుతున్నట్టు చెప్పారు. డ్రెయిన్ల ఆధునీకరణ పనులకు శ్రీకారం చుట్టామని చెప్పారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ ఛైర్‌పర్సన్ సునేత్ర దేవి, కూటమి నాయకులు విత్తనాల వెంకటరమణ, అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే గండేపల్లి మండలంలోని సూరంపాలెం గ్రామంలో జరిగిన కార్యక్రమానికి సర్పంచ్ మారిశెట్టి గంగాభవాని అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్, టిడిపి నాయకులు కోర్పు లచ్చయ్య దొర, ఎస్‌విఎస్.అప్పలరాజు, వైస్ ఎంపిపి కుంచె రాజా పాల్గొని మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ 100 రోజుల పాలన సాగిందన్నారు. తొలుత స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమలో పారిశుధ్య కార్మికులతో కలిసి గ్రామాన్ని శుభ్రం చేసి, మొక్కలు నాటారు. పొలం పిలుస్తుంది పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పోతుల మోహన్రావు, మారిశెట్టి భద్రం, కుంచె రామకృష్ణ, పోసిన బాబురావు, మాజీ జడ్‌పిటిసి యర్రంశెట్టి బాబ్జి, గ్రామ ఉపసర్పంచ్ సూరంపాలెం బాలు, తహశీల్దార్, ఎంపిడిఒ, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. అలాగే కరప మండలంలోని వేములవాడ, వలసపాలక గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, నియోజకవర్గ టిడిపి కో-ఆర్డినేటర్ పల్లి సత్యనారాయణ మూర్తి ఇంటింటికీ వెళ్లి గోడపత్రికలను అంటించారు. ఈ కార్యక్రమంలో మద్దూరు స్వామి, పేపకాయల సత్తిబాబు, నాగం బాబులు, బాలిక సూరిబాబు, చాట్ర ఇమ్మానియేలు పాల్గొన్నారు.



కరప మండలంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎంఎల్ఎ

# పలు ఆలయాల్లో ప్రాయశ్చిత్త దీక్షలు

**ప్రజాశక్తి - గండేపల్లి, పెద్దాపురం, జగ్గంపేట**

తిరుపతి వెంకటేశ్వర స్వామి ప్రసాదాన్ని అపవిత్రం చేయడంపై టిడిపి నాయకులు ప్రాయశ్చిత్త పూజలు నిర్వహించారు. గండేపల్లిలోనివెంకటేశ్వర స్వామి ఆలయంలో గ్రామ టిడిపి అధ్యక్షులు వెల్లమాటి కాశి, జెడ్ రాగంపేట సర్పంచ్ కందుల చిట్టిబాబుల ఆధ్వర్యంలో వెంకటేష్ స్వామి గుడిలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోర్పు లచ్చయ్యదొర, కోర్పు సాయితేజ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యాక్రమంలో సుంకువల్లి రమేష్, వెంపాటి సతీష్, ఇప్పర్ల బాబి, మాగంటి వీర వెంకట సత్యనారాయణ, ఇప్పర్ల సురేష్, తదితరులు పాల్గొన్నారు. పెద్దాపురం పట్టణంలో జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి బుధవారం ప్రాయశ్చిత్త దీక్షను చేపట్టారు. స్థానిక మెయిన్ రోడ్డు దాసాంజనేయ స్వామి ఆలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హిందువుల మనోభావాలు దెబ్బతినే విధంగా తిరుపతి లడ్డులో పంది కొవ్వు, విజిటేబుల్ నూనెలను వాడటం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, కూటమి నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, నిమ్మకాయల కిరణ్, పెంకే వెంకటలక్ష్మి పాల్గొన్నారు. జగ్గంపేటలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో టిడిపి నాయకులు జోగారావు ఆధ్వర్యంలోనూ, ఇర్రిపాక గ్రామంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



దీక్ష చేస్తున్న జనసేన జినసేన నాయకులు

# సీజ్ చేసిన మట్టి మాయం..!

### -కేసు నమోదులో పోలీసుల జాప్యం

**ప్రజాశక్తి - తాళ్లరేవు**

రోడ్డు చెంతనే నిల్వ చేసిన మట్టి నిల్వలను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. అయితే సీజ్ చేసిన మట్టి మాయమవ్వడంతో రెవెన్యూ అధికారులు అనుమానితులపై కోరంగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు కేసు నమోదు చేయకపోవడం పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పి. మల్లవరం పత్తిగొందిలో సర్వేనెంబర్ 197/7 పలివెల సత్యనారాయణకి చెందిన ఎనిమిది లారీల అక్రమ మట్టి ఈనెల 21వ తేదీన సీజ్ చేశారు. సీజ్ చేసిన అక్రమ మట్టిని తరలించుకుపోయిన వ్యక్తులపై కేసు నమోదు చేయాలని కోరంగి పోలీసులకు డిప్యూటీ తహశీల్దార్ సూరిబాబు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసి 4 రోజుల గడిచిన కేసు నమోదు చేయకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలావుంటే మట్టి మాయం చేసిన వ్యక్తులకు జరిమానా విధించినట్లు డిటి సూరిబాబు తెలిపారు.



మాయమైన మట్టి(అధికారులు సీజ్ చేసిన మట్టి)



ర్యాలీ వద్ద మాట్లాడుతున్న ఎంఇఒ అప్పాజీ

## నదీ జలాలను కాపాడుకోవాలి

**ప్రజాశక్తి - ఆలమూరు**

భవిష్యత్తు తరాల కోసం నదీ జలాల స్వచ్ఛతను కాపాడుకుంటూ దేశంలో స్వచ్ఛభారత్ అమలయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఇఒ-1 బి.అప్పాజీ పిలుపునిచ్చారు. ప్రపంచ నదుల దినోత్సవంలో భాగంగా కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎన్‌సిసి విద్యార్థులచే స్వచ్ఛభారత్, క్లీన్ ఇండియా, హెల్త్ ఇండియా, నదీ జలాలను కలుషితం కాకూడదనే నినాదాలతో ఆయన ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.కొత్తూరు సెంటర్లో మానవహారంతో స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారి పి.వెంకట్రావు, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం పి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విజన్-2047లో భాగస్వామ్యం అవ్వాలి

**ప్రజాశక్తి-ఆత్రేయపురం, కొత్తపేట**

స్వర్ణాంధ్ర విజన్ 2047 ప్రణాళికలో పాల్గొనాలని విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, ప్రజలు పాల్గొని విజన్ 2047 డాక్యుమెంట్ తయారీలో భాగస్వాములై వారి సూచనలు, అభిప్రాయాలు తెలియజేయాలని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు ఆత్రేయపురం మండలంలోని ర్యాలి గ్రామంలో మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం స్మార్ట్ ఫోన్ నుంచి స్వర్ణాంధ్ర లింక్ ద్వారా వచ్చే క్యూఆర్ కోడ్ ద్వారా వచ్చే సర్టిఫికెట్ స్వీకరించాలని తెలిపారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి వివరాలను పూరించి సూచనలు, అభిప్రాయాల్ని నమోదు చేయాలని కోరారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాస్ పాల్గొన్నారు. కొత్తపేటలోని సిద్ధార్థ శతాబ్ది కళాశాలలో విద్యార్థులు ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ కట్టా నాగమోహన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తహశీల్దారు వై.రాంబాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల పరిపాలన అధికారి రెడ్డి సత్యనారాయణ, ఆర్ఐ కె.ఏడుకొండలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సామగ్రి అందజేత

**ప్రజాశక్తి - ఆలమూరు**

జొన్నాడలో బుధవారం తెలుగు రైతు అధ్యక్షుడు గొడవర్తి దుర్గ ప్రసాద్ (బాబి) పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు విద్యా సామాగ్రి అందజేశారు. బాబి పుట్టినరోజు వేడుకలు పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పలువురు నాయకులు కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. భావన శ్రీనివాస్, వీరి సందీప్, పట్టెం వీరబాబు ఆధ్వర్యంలో స్థానికపాఠశాలల విద్యార్థులకు తమ సొంత నిధులతో పెన్నులు, జామెట్రీ కిట్లు పంపిణీ చేశారు.

## వరద బాధితులకు ఆజాద్ ఫౌండేషన్ సాయం

**ప్రజాశక్తి-అమలాపురం**

విజయవాడ వరద బాధితులకు ఆజాద్ ఫౌండేషన్ రూ.50 వేల సాయాన్ని సిఎం రిలీఫ్ ఫండ్‌కు కలెక్టర్ మహేష్ కూమార్‌కు బుధవారం అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు యల్లమిల్లి ఆజాద్ నాగసుధా కొండలరావు (కొండ), ఫౌండేషన్ సభ్యులు అడ్డాల గోపాలకృష్ణ, రంకిరెడ్డి కాశీ విశ్వనాథ్, ఆకెళ్ల నారాయణ మూర్తి, వంటెద్దు బాబి, నిమ్మకాయల సుబ్బారావు, రాకుర్తి పట్టాభి రామయ్య, అడబాల బుజ్జి, కొత్తపల్లి వంశి పాల్గొన్నారు.

## చిట్టబ్బాయి విగ్రహం తొలగింపునకు యత్నం దారుణం

**ప్రజాశక్తి-అమలాపురం**

మాజీ ఎంఎల్ఎ చిట్టబ్బాయి విగ్రహాన్ని తొలగించేందుకు యత్నించడం దారుణమని పలువురు శెట్టిబలిజ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. డివైడర్‌లో ఉన్న విగ్రహాలు వదిలేసి రోడ్డుకు దూరంగా ఉన్న చిట్టబ్బాయి విగ్రహాన్ని తొలగించేందుకు కొంతమంది కోర్టులను ఆశ్రయించడం దారుణమన్నారు. చిట్టబ్బాయి అమలాపురం పట్టణానికి ఎంఎల్ఎగా ఎన్నో సేవలు చేశారని, ఆయన విగ్రహాన్ని తొలగించేందుకు సిద్ధపడటం సరికాదన్నారు. బుధవారం పలువురు నాయకులు సమావేశమై విగ్రహాన్ని తొలగించే ప్రక్రియను న్యాయపరంగా అడ్డుకోవాలని నిర్ణయించారు.

## క్షతగాత్రులకు ఆర్థిక సాయం

**ప్రజాశక్తి-అమలాపురం**

ఇటీవల అమలాపురం పట్టణం రావులచెరువు ప్రాంతంలో జరిగిన అగ్ని ప్రమాదంలో 14 మంది వరకు గాయపడ్డారు. వీరిలో ఒక మహిళ మతి చెందింది. ఈ కుటుంబాలని ఆదుకోవాలనే ఉద్దేశంతో శెట్టిబలిజ హెల్పింగ్ హాండ్స్ ఆధ్యర్యాన నగదు సేకరించారు. నగదును బాధిత కుటుంబాలకు బుధవారం అందజేశారు. మతురాలు గొవ్వాల నాగలక్ష్మి కుటుంబానికి రూ.1,30,000, చొల్లంగి మారుతి సుబ్రమణ్యం, కట్టా వెంకట్, దూనబోయిన సుబ్బలక్ష్మి, దూనబోయిన గాయత్రి, పితాని శాంతి, బొక్కా ప్రియాంకలకు రూ.10,000 చొప్పున నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, మట్టపర్తి మీరా సాహెబ్ శెట్టి, గొవ్వాల రాజేష్, కుడిపూడి భరత భూషణ్, దొమ్మేటి రాము, సంసాని బుల్లి నాని, మట్టపర్తి నాగేంద్ర, చెల్లుబోయిన నాని, గుత్తుల చిరంజీవి, కముజు రమణ, చిట్టూరి పెదబాబు, దొమ్మేటి వెంకటేశ్వరరావు, విత్తనాల శేఖర్, గుత్తుల నాగబాబు, కేతా భాను తేజ, గుత్తుల రాజు పాల్గొన్నారు.

## ఎమ్‌డి దృష్టికి మిల్లర్ల సమస్యలు

**ప్రజాశక్తి - ఆలమూరు**

ఎపి పౌరసరఫరాల సంస్థ ఎండీగా బాధ్యతలు స్వీకరించిన ఎం.జిలానిని స్టేట్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గుమ్మడి వెంకటేశ్వరరావు, కొత్తపేట నియోజకవర్గ అధ్యక్షులు వంటిపల్లి పాపారావులు బుధవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. మిల్లర్ల సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయనను సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మిల్లర్లపై సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎండి జిలాని పూర్తిస్థాయిలో రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి కషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారని పాపారావు స్థానిక విలేకరులకు తెలిపారు. పాపారావు వెంట నియోజకవర్గ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు చుండ్రు శ్రీనివాస్ ఉన్నారు.

## ఎలక్ట్రికల్ ఎస్ఇగా రాజబాబు

**ప్రజాశక్తి-అమలాపురం**

ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇగా ఎస్.రాజబాబు బుధవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా ఏర్పడిన తరువాత మొదటి సారిగా ఈ నియామకం జరిగింది. ఇప్పటివరకు నోడల్ అధికారిగా ఎం.రవి కుమార్ బాధ్యతలు నిర్వహించారు. ఇప్పటి వరకు జిల్లాకు సంబంధించి రాజమండ్రి కేంద్రంగా ఎస్ఇ పర్యవేక్షణ ఉండేది. ఎట్టకేలకు జిల్లా ఏర్పడిన రెండున్నరేళ్లకు ఎస్ఇని నియమించడంపై విద్యుత్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కొలిక్కి వచ్చేలా అధ్యాపకుల సమస్య

**ప్రజాశక్తి- రాజోలు**

తమకు 6 నెలలుగా జీతాలు చెల్లించడం లేదని మలికిపురం ఎంవిఎన్‌జెఎస్‌ఆర్‌విఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు 15 రోజుల నుంచి ధర్నా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని వారు ఎంఎల్ఎ దేవ వర ప్రసాద్ దృష్టికి తీసుకొని వెళ్లి న్యాయం చేయాలని కోరారు. దీంతో ఆయన స్పందించి ప్రభుతానికి లేఖ రాసారు. అమరావతి వెళ్లి అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వ ఉన్నతాధికారులకు వివరించారు. దీంతో ప్రభుత్వం ఒక ఉన్నత కమిటీని నియమించింది. కళాశాల విద్య జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సి.కృష్ణ (అమరావతి) నేతత్వంలో ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం ఆంగ్ల సాహిత్య ప్రొఫెసర్ డి.జ్యోతిర్మయి, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫిజిక్స్ ప్రొఫెసర్ ఆర్‌విఎస్ఎస్ఎన్.రవికుమార్ సభ్యులుగా కమిటీని నియమిస్తూ ఉత్తరువులు జారీ చేసింది. ఆ ప్రతులను ఎంఎల్ఎ బుధవారం అధ్యాపకుల ధర్నా శిబిరంలో అందజేశారు.

## పారిశుధ్య నిర్వహణతోనే ఆరోగ్యం

**ప్రజాశక్తి-ఆత్రేయపురం**

గ్రామాల్లో పారిశుధ్యం సక్రమంగా నిర్వహిస్తేనే ఆరోగ్యం వెల్లివిరిస్తుందని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని ర్యాలి గ్రామంలో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, జనసేన పార్టీ ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. తద్వారా ప్రజలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ వంద రోజులు ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పని చేశామని చెప్పారు. హామీ మేరకు ఒకేసారి రూ.వెయ్యి పెంచి పింఛను ఇచ్చామని తెలిపారు. డిఎస్‌సి అభ్యర్థుల కోసం 16 వేలకుగా పైగా ఖాళీలను భర్తీ చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు మొదటి సంతకం చేశారని గుర్తు చేశారు. తొలుత గ్రామంలో స్వచ్ఛతాహి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. హైస్కూల్లో విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు సత్యానందరావు, శ్రీనివాస్ బహుమతులు ప్రదానం చేశారు.

## టీచర్స్ ఒలింపిక్స్‌లో ఉదయకృష్ణకు ప్రథమం

**ప్రజాశక్తి-కపిలేశ్వరపురం**

జిల్లా స్థాయిలో ఆదివారం టీచర్స్ ఒలింపిక్స్‌లో మాచర ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఆర్.ఉదయకృష్ణ బ్యాడ్మింటన్ షటిల్స్‌లో ప్రథమ స్థానం సాధించారు. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఆయన పాల్గొనున్నారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో మండల యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఉదయకృష్ణను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్.రమాదేవి, యుటిఎఫ్ మండల అధ్యక్షుడు జువ్వల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఇళ్ల సూరిబాబు, గౌరవాధ్యక్షుడు ఎంవి.రమణారావు, జీవి భీమేశ్వరరావు, పి.సురేంద్ర కుమార్, డివి.రాఘవులు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

# సంక్షిప్త వార్తలు

## యానాం వార్తలు



నివాళులర్పిస్తున్న యానాం అధికారులు

### వేణుగోపాలరావు నాయుడుకు నివాళి

**ప్రజాశక్తి - యానాం**

ఫ్రెంచ్ కాలంలో యానాం పట్టణ మేయర్‌గా సేవలందించినకామిశెట్టి వేణుగోపాలరావు నాయుడు వర్ధంతిని బుధవారం సమాచార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక రాజీవ్ బీచ్ రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి ఆర్ఎఒ మునిస్వామి, ఎస్‌పి రాజశేఖరన్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐ షణ్ముగం, ఎస్ఐలు మురుగానందం, శేరు నూకరాజు, కెఎల్‌వి.ప్రసాద్ పాల్గొన్నారు.

### ఐటిఐలో ఖాళీ సీట్లు భర్తీ

**ప్రజాశక్తి - యానాం**

స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటిఐలో ఫ్యాషన్ డిజైనింగ్ అండ్ టెక్నాలజీ, ఫిట్టర్ ట్రేడులలో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేయడానికి ఈనెల 29వ తేదీ వరకు యానాం అభ్యర్థులకు ప్రవేశం కల్పిస్తున్నట్లు ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ చింతపల్లి కృష్ణసుధాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇతర రాష్ట్ర అభ్యర్థులకు సంబంధించి ఈనెల 30వ తేదీన సంవత్సరానికి 6 వేల రూపాయలు ట్యూషన్ ఫీజుతో ప్రవేశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆఫీసు పనివేళల్లో సంప్రదించాలన్నారు.

## ఆన్‌లైన్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం ప్రారంభం

**ప్రజాశక్తి - గండేపల్లి**

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఆదిత్య లెర్నింగ్ అకాడమీ, ఎఐ అండ్ ఎంఎల్ విభాగం ఆధ్వర్యంలో 'డేటా విసులైజేషన్ విత్ పవర్ అనే అంశంపై ఆన్‌లైన్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం బుధవారం ప్రారంభం అయింది. ఈ ప్రోగ్రాంలో డేటా విసులైజేషన్ మరియు అత్యాధునిక బిఐ టూల్స్ వాడకంలో అనేక నూతన అంశాలతో కూడిన పటిష్టమైన ప్రణాళికతో పాఠ్యాంశాలును బోధించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ ఎం.వెంకటేష్ రిసోర్స్‌పర్సన్స్‌గా వ్యవహరించారు. అక్టోబర్ 4వ తేదీ వరకూ ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందని యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ అకడమిక్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, అలా కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.వీరాంజనేయులు, వివిధ విభాగాల విభాగాధిపతులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలి

**ప్రజాశక్తి - సామర్లకోట**

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా, మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న వారికి సత్కార కార్యక్రమం జరిగింది. ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్యల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతం పెరుగుతుండగా కార్పొరేట్ పాఠశాలల్లో వందలాదిగా విద్యార్థుల శాతం తగ్గుతూ వస్తుందన్నారు. ఉత్తమ సేవలు అందించే అధికారులకు, ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తుందన్నారు. జిల్లా ఉత్తమ అవార్డు గ్రహీతలు కెబిఆర్.బలరాం, అద్దంకి వెంకన్నబాబు, మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు టివివి.సత్యనారాయణ, పి నాగమణి, కె.విద్యావాణి, బిఎస్ఎన్.మూర్తి, ఎం.ఇజ్రాయేలు, డి.సూర్య కుమారి, ఎం.త్రిమూర్తులు, ఎస్‌వి.రామారెడ్డి, ఎంఇఒలు వై.శివరామ కృష్ణయ్య, పి.పుల్లయ్య, ఎంపిడిఒ డి.శ్రీలలితలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, కూటమి నాయకులు విత్తనాల.వెంకటరమణ, గుమ్మళ్ళ రామకృష్ణ తోటకూర శ్రీనివాస్, అడబాల కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంఎల్ఎ

## ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మందుల పంపిణీ

**ప్రజాశక్తి - గండేపల్లి**

వరల్డ్ ఫార్మసిస్ట్ డే సందర్భంగా ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థినీ, విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఈలకొలను గ్రామంలో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈలకొలను గ్రామంలో ఐరన్ టాబ్లెట్లు, మల్టీ విటమిన్ టాబ్లెట్, జ్వరం టాబ్లెట్, గ్యాస్ సమస్యలకు మందులు ఉచితంగా గ్రామ ప్రజలకు ఇచ్చారు. వరల్డ్ ఫార్మసిస్ట్ రోజు సామాజిక సేవ చేయడం ఎంతో ముఖ్యమని ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవిశంకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి.ప్రశాంతి, ఎం.శేషసాయిదుర్గ, గ్రామస్తులు అజ్జు సత్య సుబ్రహ్మణ్యం నాయుడు, ఎరుబండి శివకుమార్, పల్లేటి శ్రీనుబాబు, కోనే చక్రవర్తి పాల్గొన్నారు.

## నిత్యాన్నదానానికి రూ.50 వేల విరాళం

**ప్రజాశక్తి - సామర్లకోట**

భీమేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే నిత్య అన్నదాన ట్రస్ట్‌కు హైదరాబాద్‌కు చెందిన రావుల పాండారి నేత్ర హేమలత రూ.50 వేలు విరాళాన్ని అందించారు. స్వామివారి, అమ్మవారి దర్శనం అనంతరం వారికి ఆలయ అర్చకులచే వేద ఆశీర్వచనం పలికి ప్రసాదాలను అందించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బల్ల నీలకంఠం తెలిపారు.

## ఫ్లయ్ ఓవర్ పనుల వేగవంతానికి ఆదేశం

**ప్రజాశక్తి-అమలాపురం**

జాతీయ రహదారి 216-ఎపై జొన్నాడ వద్ద నిర్మిస్తున్న ఫ్లయ్ ఓవర్ నిర్మాణ పనులు వేగవంతం చేసి 2025 జనవరి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జొన్నాడ ఫ్లయ్ ఓవర్ నిర్మాణ పనుల పురోగతిపై జాతీయ రహదారుల అథార్టీ ఆఫ్ ఇండియా ఇంజనీర్లు, కాంట్రాక్టర్లతో ఆయన సమీక్షించారు. తొలుత ఇప్పటివరకు జరిగిన పనులను కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలించారు. నిర్మాణంలో పూడికకు అవసరమైన మట్టిని ప్రభుత్వ పరంగా సమకూరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెసి టి.నిషాంతి, అధికారులు సురేంద్రనాథ్, ఎ.శ్రీనివాస్, సాయినాథ్ పాల్గొన్నారు.



ఆలమూరులో సామూహిక సీమంతాలు

## పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

**ప్రజాశక్తి - ఆలమూరు**

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం అంటూ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మాసోత్సవాలలో భాగంగా మండల కేంద్రంలో బుధవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. టిడిపి రైతు అధికార ప్రతినిధి ఈదల సత్యనారాయణమూర్తి సమకూర్చిన చీరలు, పండ్లు, స్వీట్స్, గాజులు 25 మందికి అందజేశారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగలక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. గర్భిణులు, బాలింతలకు ప్రతినెలా ప్రభుత్వం నుంచి పౌష్టికాహారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఈదల రాంబాబు, వంటిపల్లి సతీష్, రామానుజుల శేషగిరిరావు, ఈదల నల్ల బాబు, కడియాల శ్రీను, మానేపల్లి శ్రీనివాస్, సాలి సత్యనారాయణ, పట్టాభి పాల్గొన్నారు.